ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోతున్న జీఎస్ఎల్వీ రాకెట్


రాకెట్ మొదటి దశ


రెండవ దశ


మూడవ దశ


రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

షార్ సత్తా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ మరోమారు సత్తాచాటింది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి దేశ ప్రతిష్టను పెంచింది.వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని శనివారం సాయంత్రం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.18.46 నిమిషాల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ మూడు దశలను పూర్తి చేసుకొని ఉపగ్రహాన్ని విజయవంతంగా రోదసిలోకి చేర్చడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి.ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేలమందికి పైగా విచ్చేశారు. వీరిలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరందరూ ఉదయం నుంచే షార్ సమీపంలో ఉన్న సందర్శకుల గ్యాలరీకి చేరుకొన్నారు.రాకెట్ నింగికెగిరిన సమయంలో ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.షార్ నుంచి ఇప్పటి వరకు 91 ప్రయోగాలు చేపట్టారు. తాజా ప్రయోగం 92వది కాగా జీఎస్ఎల్వీ-మార్క్ 2 ప్రయోగాల్లో 16వ ప్రయోగం కావడం విశేషం.కాగా ఈ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరికి శనివారం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ పూజలు చేశారు.అలాగే తిరుమల ఆలయంలో, శ్రీకాళహస్తీశ్వరాలయంలో జీఎస్ఎల్వీ- ఎఫ్14 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ ఉన్నారు.

థర్డ్ జనరేషన్ శాటిలైట్

ఇన్‌శాట్-3డీఎస్ మూడవ తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఉపగ్రహంలో వాతావరణ పరిస్థితిని అంచనా వేయగల అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ ఉపగ్రహం ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల సేవలకు కొనసాగింపుగా వాతావరణ సేవలను మెరుగుపరచనుంది.


జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏందిది జగనా?

- ప్రయాణికులు ఏమైపోతేనేం?... సిద్ధం సభ సజావుగా సాగితే చాలు!!
- జిల్లానుంచీ 374... తిరుపతినుంచే అత్యధికంగా 119 ఆర్టీసీ బస్సుల కేటాయింపు
- తిరుమల డిపోనూ వదలని వైనం... 52 బస్సుల మళ్ళింపు
- తిరుగు ప్రయాణంలో సతమతమైన యాత్రికులు
- 300 విద్యా సంస్థల బస్సులు అదనం

డిపోల వారీగా పంపిన బస్సులు

తిరుపతి - 62, తిరుమల - 52
అలిపిరి డిపో- 27, మంగళం- 30
గూడూరు- 30, పుత్తూరు- 42
శ్రీకాళహస్తి- 45, వెంకటగిరి- 25
వాకాడు-21, సత్యవేడు-20
సూళ్ళూరుపేట-20

తిరుపతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో నేడు జరగనున్న వైసీపీ సిద్ధం బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు జిల్లానుంచీ ఏకంగా 374 ఆర్టీసీ బస్సులు కేటాయించేశారు.అంటే సగానికి పైగా బస్సులు జిల్లా ప్రయాణికులకు మూడురోజులు అందుబాటులో వుండనట్టే. సభ జరిగేది ఆదివారమైతే శనివారం తెల్లవారుఝామునే కేటాయించిన మండలాలకు, గ్రామాలకు బస్సులను తరలించేశారు. దీంతో శని, ఆదివారాలతో పాటు బస్సులు తిరిగి డిపోలకు చేరే సోమవారం దాకా ప్రయాణికులకు జిల్లాలో ఈ దురవస్థ తప్పేలాదు.


తిరుపతి బస్టాండులో బస్సుల కోసం ఎదురుచూపులు


తిరుపతిలో బస్సుల్లేక వెనుదిరుగుతున్న ప్రయాణికులు

తిరుమల యాత్రికుల అవస్థలు

తిరుపతి నుంచీ తిరుమల వెళ్ళడానికి బస్సుల కొరత పెద్దగా కనిపించలేదు. అయితే తిరుమల నుంచీ తిరుగు ప్రయాణమై తిరుపతి బస్ స్టేషన్ చేరుకున్న ప్రయాణికులకు మాత్రం స్వస్థలాలకు వెళ్ళడానికి చుక్కలు కనిపించాయి. దాదాపుగా దూర ప్రాంతాలకు వెళ్ళే బస్సులన్నీ వైసీపీ సభకు కేటాయించడంతో తీవ్ర బస్సుల కొరత ఏర్పడింది. దీంతో అడపాదడపా వచ్చిన బస్సుల్లో చొరబడేందుకు యత్నించి ప్రయాణికులు అవస్థల పాలయ్యారు. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు గంటల తరబడీ బస్సుల కోసం పడిగాపులు కాయాల్సివచ్చింది.

గూడూరు, వెంకటగిరి డిపోలు ఖాళీ

గూడూరు ఆర్టీసీ డిపోలో వున్నదే మొత్తం 45 బస్సులు. అందులో ఏకంగా 30 బస్సులను సిద్ధం సభకు పంపించేశారు. దీంతో మిగిలిన 15 బస్సులతో చాలా పరిమిత సేవలు మాత్రమే శనివారం అందించారు. గూడూరు నుంచీ నెల్లూరు, తిరుపతి, వెంకటగిరి తదితర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. వెంకటగిరి డిపోలో మొత్తం 32 బస్సులుంటే 25 బస్సులు సభ కోసం కేటాయించారు. దీంతో కేవలం ఏడు బస్సులతో రెండు రోజులు నెట్టుకురావాల్సి వస్తోంది. దీనివల్ల రాపూరు, నాయుడుపేట ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు బాగా అసౌకర్యానికి గురవుతున్నారు. వాకాడు డిపోలో 40 బస్సులుంటే 20 బస్సులు వైసీపీ సభకు కేటాయించడంతో సగం బస్సులతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇక్కడి నుంచీ నెల్లూరు, గూడూరు వెళ్ళడానికి ప్రత్యామ్నాయం లేక సతమతమయ్యారు. సూళ్ళూరుపేట డిపోలో మొత్తం 42 బస్సులుంటే అందులో 20 బస్సులు సభకు జన సమీకరణ కోసం పంపించేశారు. దీంతో నెల్లూరు, తిరుపతి, చెన్నై తదితర ప్రధాన మార్గాలతో పాటు గ్రామీణ ప్రాంత సర్వీసులు కూడా రద్దయ్యాయి.


శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ముక్కంటి క్షేత్రంలో ప్రయాణికుల అగచాట్లు

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో వంద బస్సులున్నాయి. వాటిలో 40 బస్సులను జగన్ సభ కోసం మళ్ళించారు. 40 శాతం బస్సులు తగ్గిపోవడంతో నెల్లూరు మార్గంలోనూ, గ్రామీణ రూట్లలోనూ బస్సులు రద్దయ్యాయి. దీంతో ప్రధానంగా నెల్లూరు వైపు వెళ్ళాల్సిన ప్రయాణికులు గంటల కొద్దీ బస్ స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. పుత్తూరు డిపోలో 77 బస్సులుండగా 41 బస్సులను సభకు మళ్ళించిన ఫలితంగా తిరుపతి, నగరి, చిత్తూరు, సత్యవేడు మార్గాల్లో బస్సులు సరిపోక ప్రయాణికులు తీవ్ర అవస్థ పడ్డారు. అలాగే అప్పలాయగుంట, బాదూరు, పచ్చికాపల్లం, గొల్ల కండ్రిగ, విజయపురం, పుల్లూరు, పాలసముద్రం, నిండ్ర, కేవీబీపురం తదితర గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే జనం ఉదయం నుంచే ఇబ్బంది పడ్డారు. సత్యవేడు డిపోలో 50 బస్సులుండగా 20 బస్సులు సభ కోసం కేటాయించడంతో తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు, సూళ్ళూరుపేట తదితర ముఖ్యమైన మార్గాల్లో రోజంతా కలిపి రెండు మూడు బస్సులే నడిచాయి. దీంతో ఈ మార్గాల్లో వెళ్ళాల్సిన ప్రయాణికులు నానా అవస్థ పడ్డారు.

20నుంచి భువనేశ్వరి పర్యటన

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 20వ తేదీనుంచి చిత్తూరు,తిరుపతి జిల్లాల్లోని ఆరు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టయి జైలుకెళ్లినప్పుడు ఆవేదనతో మరణించిన వారి కుటుంబాలను ఆమె 23వ తేదీ వరకూ పరామర్శించనున్నారు.

యాత్రకు రండి...ప్లీజ్!


చంద్రగిరిలో సినిమా హాలు వద్దకు బస్సుల్లో తరలిస్తున్న జనం

'రండి బాబూ రండి, రండి తల్లీ రండి...మీకోసం లగ్జరీ బస్సు పెట్టాం. ఇంటర్వెల్లో స్నాక్స్ కూడా ఇస్తాం. బిందాస్‌గా వచ్చి సినిమా చూసి వెళ్లండి' అంటూ చంద్రగిరి నియోజక వర్గ ప్రజల వెంట పడుతున్నారు వైసీపీ నాయకులు. జగన్ ప్రచారం కోసం తీసి విడుదల చేసిన యాత్ర-2 సినిమా థియేటర్లు వెలవెలపోతుండడంతో వాటిని నింపడానికి నానా అవస్థలూ పడుతున్నారు. శనివారం నుంచి చంద్రగిరిలో యాత్ర-2 సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు జనాన్ని తరలించే ఏర్పాట్లు ఘనంగానే మొదలు పెట్టారు. ప్రత్యేక షోలు ఏర్పాటు చేశారు. పంచాయతీకి రెండు బస్సులు చొప్పున సిద్ధం చేశారు. ఎమ్మెల్యే ఏపీఆర్వోల ద్వారా ఈ సమాచారాన్ని పంచాయతీల పరిధిలోని సచివాలయాలకు చేర్చారు. వలంటీర్ల ద్వారా ప్రేక్షకులను రాబట్టే ప్రయత్నం చేశారు. పెద్ద పంచాయతీలకు ప్రత్యేక లగ్జరీ బస్సులను పంపారు. చిన్న పంచాయతీలకు మినీ బస్సులను పంపారు. బస్సులను థియేటర్ వద్ద నిలిపి అందులోని వారిని దగ్గరుండి హాలు లోపలకు సాగనంపారు.ఇంటర్వెల్ సమయంలో సమోసా, కూల్‌డ్రింక్స్ అందించారు.చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలూ కవరయ్యేలా ప్లాన్ చేశారు. మరో మూడు రోజుల పాటు యాత్ర-2 సినిమాను ఆడేలా చేయాలన్న సంకల్పంతో వైసీపీ నేతలున్నారు. ఇందులో భాగంగా శనివారం మార్నింగ్ షో చూపించాలని తొలుత భావించారు. కానీ అనుకున్నంత స్పందన లేకపోవడంతో వారిని మ్యాట్నీకి మార్చారు. తొలిరోజే స్పందన లేకపోతే మిగిలిన రోజులు ఎట్లస్వామీ అని కార్యకర్తలు, వలంటీర్లు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

విద్యాసంస్థల నుంచీ 300 బస్సుల మళ్ళింపు

జిల్లావ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థల నుంచీ రాప్తాడు సభకు 300 బస్సులను మళ్ళించారు. వీటిలో ప్రధానంగా తిరుపతి నగరం నుంచే అత్యధికంగా తరలి వెళ్ళాయి. ప్రతి విద్యా సంస్థ నుంచీ సగం బస్సులు కేటాయించాలని అధికారులు హుకుం జారీ చేయడంతో శనివారం ఉదయాన్నే బస్సులన్నీ నిర్దేశిత మండలాలకు, గ్రామాలకు బయల్దేరి వెళ్ళాయి. దీంతో శనివారం ఆయా విద్యా సంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు సొంతంగా రాకపోకలు సాగించగా హైస్కూలు లోపు విద్యార్థులను తల్లిదండ్రులు వదిలిపెట్టాల్సి వచ్చింది. కొన్ని చోట్ల విద్యా సంస్థలే విద్యార్థుల కోసం ఆటోలు పంపించాయి.

పాపం...పిల్లలు


బాలాయపల్లి బస్టాండు వద్ద విద్యార్థుల పడిగాపులు

బాలాయపల్లి , ఫిబ్రవరి 17:.బాలాయపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 350మంది విద్యార్థులున్నారు.వీరిలో బాలాయపల్లి మండలంలోని వెంకటరెడ్డిపల్లి ,అంబలపూడి,గూడూరు మండలం గొల్లపల్లి నెన్నూరు ,కొమ్మనేటూరు , చెమిర్తి , తిప్పవరపాడు గ్రామాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్నారు.ఆర్టీసీ బస్సులు సిద్ధం సభకు వెళ్లడంతో వెంకటగిరి - గూడూరు మార్గంలో బస్సులు లేక సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.



సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలను ఆక్రమించుకున్న పేదలు

కుంట్రపాకంలో వెలసిన గుడిసెలు

● అడ్డుకున్న పోలీసులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17: నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే అడ్డుకుంటారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పోలీసులపై ధ్వజమెత్తారు. కుంట్రపాకం సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలు ఇంటి స్థలాలను ఆక్రమించున్నారు. దీనిని పోలీసులు అడ్డుకున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములను కబ్జారాయుళ్లు ఆక్రమించుకుంటే పట్టించుకోని పోలీసులు పేదలను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని మురళి అన్నారు. పోలీసు, రెవిన్యూ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే గుడిసెలు వేసుకున్న వారందరికీ స్థలాలు , పట్టాలు మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఫిబ్రవరి 17: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠించగా ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగ్రలాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో హథీరాంజీ మఠం భూమి ఆక్రమణ



హథీరాంజీ మఠం స్థలంలో నిర్మాణాలు



రోడ్డు పక్కనే పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్

చంద్రగిరి, ఫిబ్రవరి 17: చంద్రగిరి మండలం మిట్టపాలెంలో హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మఠం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. చంద్రగిరి-శ్రీనివాసమంగాపురం రహదారిలోని మిట్టపాలెంలో లక్షల రూపాయల విలువైన హథీరాంజీ మఠం భూమిని అదే గ్రామానికి చెందిన ఉద్యోగ సంఘ నాయకుడిగా పనిచేసిన వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలకు ట్రాన్స్‌ఫార్మర్ అడ్డంగా ఉందని, తన పలుకుబడితో రహదారికి ఆనుకుని దానిని ఏర్పాటు చేయించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో భక్తులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా హథీరాంజీ మఠం అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని, రోడ్డుకు ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దూరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

చంద్రగిరి, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ శనివారం చంద్రగిరిలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా నినాదాలు చేస్తూ టవర్ క్లాక్ వద్దకు చేరుకుని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు ఆలస్యం అవుతున్నందున 30 శాతం ఐఆర్‌ను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఏఎస్వో స్వర్ణలత, డీటీ అమృత, ఆర్ఐ సులోచన, ఎంపీహెచ్‌వో ఈశ్వరయ్య, ఏఈవో మురళీధర్, ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, రామిరెడ్డి, వీఆర్వోలు వెంకన్ననాయుడు, మునస్వామి, వాసు, శ్రీనివాసులు, విజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

గజ బాధితుడికి ఆర్థిక సాయం



చంద్రగిరి, ఫిబ్రవరి 17: చంద్రగిరి మండలం యల్లంపల్లెకు చెందిన మనోహర్‌రెడ్డికి అటవీ శాఖ ఆర్థిక సాయం చేసి ఆదుకుంది. మండలంలోని యల్లంపల్లెలో ఈనెల 13వ తేది రాత్రి తన పొలం వద్ద రైతు మనోహర్‌రెడ్డి నిద్రిస్తుండగా ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. సకాలంలో అటవీ అధికారులు స్పందించి మనోహర్‌రెడ్డి రక్షించి తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన రైతును ఎఫ్ఆర్వో మాధవి పరామర్శించి అటవీశాఖ నుంచి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో డీఆర్వో చినబాబు, ఎఫ్‌బీవో శంకరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



అంజలి

భాకరాపేట, ఫిబ్రవరి 17: జేఈఈ మెయిన్స్ పరీక్షలో చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ పంచాయతీ తొగటపల్లెకు చెందిన అంజలి 82.95 శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అంజలిని పలువురు అభినందించారు.

రేపు తిరుపతి రూరల్ మండల సమావేశం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17: తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

బిల్లులు చేసేందుకు లంచం డిమాండ్

తిరుపతిలో సీబీఐకి చిక్కిన రైల్వే ఇంజనీరింగ్ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒక కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడానికి లంచం తీసుకున్న దక్షిణ మధ్య రైల్వే తిరుపతి సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌తో పాటు అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. కర్నూలులోని ఏసీబీ కేసుల విచారణ న్యాయస్థానంలో హాజరుపరచగా రెండు వారాలు డిమాండ్ విధించింది. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తిరుపతిలో హెచ్ఓజీ కోచ్‌ల వాషింగ్, సిక్ లైన్‌ల నిర్వహణ డిపో కోసం 750 వాల్టుల సామర్థ్యం కలిగిన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు రూ.2,56,73,148 విలువైన టెండర్‌ను మైసూరుకు చెందిన కోర్ ఫోర్ ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. గత ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించగా, టెండర్ నిబంధనల ప్రకారం ఆరునెలల్లో పూర్తిచేయాలి. కానీ పలు కారణాల వల్ల జనవరి 2024 నాటికి పని పూర్తయింది. పనులు పూర్తయినట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఈఐజీ సర్టిఫికెట్ కూడా జారీ చేశారు. పూర్తిచేసిన పనులకు సంబంధించిన సుమారు రూ.1.99 కోట్లు బిల్లు కాంట్రాక్టర్ అందుకున్నారు. ఇదిలా ఉండగా బిల్లులు చేయడానికి సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) గంటా రామమోహన్‌రావు, మరికొందరు తమను లంచాల కోసం వేధించారని, తాము ఇవ్వకపోవడంతో చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో ట్రెంచింగ్ పనులు, బోరు వేయాలని, అప్పుడే మిగిలిన బిల్లు చెల్లిస్తామని చెబుతున్నారంటూ ఈ నెల 15న కోర్ ఫోర్ ఇంజనీర్స్ సంస్థ సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేసింది. సీబీఐ అధికారుల సూచన మేరకు పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గంటా మోహనరావుకు రూ.40 వేలు, అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ అప్పలరాజుకు రూ.20 వేలు లంచం ఇస్తుండగా సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపైనా కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు. అదేసమయంలో వారి కార్యాలయం, ఇళ్లలో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించి కొన్ని డాక్యుమెంట్లను సీజ్ చేశారు.

ఎల్లుండినుంచి నారా భువనేశ్వరి పర్యటన

● 4రోజులపాటు నిజం గెలవాలి కార్యక్రమం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఈనెల 20వ తేదీనుంచి నాలుగు రోజుల పాటు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు.స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టు అయినప్పుడు ఆవేదనతో మరణించిన వారి కుటుంబాలను ఆమె పరామర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె 20వ తేదీన మధ్యాహ్నం గుడుపల్లె మండలం కొడతనపల్లె, యామగానిపల్లెల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. అన్న క్యాంటీన్, చర్చి, మసీదులను సందర్శించి ఆ రోజు రాత్రి కుప్పంలోని ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో బస చేస్తారు.21వ తేదీన శాంతిపురం, రామకుప్పం మండలాల్లో అన్న క్యాంటీన్లను పరిశీలిస్తారు. భోజనానంతరం పెద్దపంజాణి, పుంగనూరు మండలాల్లోని బాధిత కుటుంబాల్ని పరామర్శిస్తారు. ఆ రోజు రాత్రి మదనపల్లెలో బస చేస్తారు.22వ తేదీన పుంగనూరు, పులిచెర్ల, పూతలపట్టు, చిత్తూరు మున్సిపాలిటీ, చిత్తూరు రూరల్ ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు.ఆ రోజు చిత్తూరు నగరంలోనే బస చేస్తారు. 23వ తేదీన ఎస్ఆర్‌పురం, నారాయణవనం మండలాల్లోని బాధిత కుటుంబాలను కలుస్తారు.మధ్యలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యార్థులతో సమావేశమవుతారు.అదేరోజు మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు.

స్విమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

● పదిరోజుల్లో పూర్తిగా కోలుకున్న బాధితుడు



విద్యార్థితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి అత్యంత సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆయన శనివారం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్‌కుమార్ ద్వివేది స్థానిక వేదిక్ యూనివర్సిటీలో ఎంఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న యూనివర్సిటీ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని తలభాగంలోని నుదుటి ఎముకలు దెబ్బతిని, మెదడులోకి చొచ్చుకుపోయాయి. దవడ ఎముకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్విమ్స్‌కు తీసుకురావడంతో న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు 4 గంటలపాటు శ్రమించి అతిక్లిష్టమైన సర్జరీని అధునాతన పరిజ్ఞానంతో విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు. ముఖ భాగానికి మునుపటి రూపం తీసుకురావడమేగాక పది రోజుల్లోనే కోలుకునేలా చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా సర్జరీని పూర్తి ఉచితంగా చేయగలిగామని తెలిపారు. సచిన్ కుమార్ ద్వివేది మాట్లాడుతూ తన ప్రాణం నిలబెట్టిన స్విమ్స్, టీటీడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, ఎంఎస్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ, అనస్థీషియా విభాగాధిపతులు డాక్టర్ రమేష్ చంద్రా, డాక్టర్ అలోక్ సమంత్రే, డాక్టర్లు బీసీఎం ప్రసాద్, వెంకట్, చంద్రశేఖర్, ప్రవీణ్ కుమార్, నాగతేజ, డీడీలు ప్రభావతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో బాధ్యతగా పనిచేయండి

● సెక్టోరల్, పోలీసు అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17: రాబోయే ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్, పోలీసు అధికారులు అత్యంత బాధ్యతగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎన్నికల సెక్టోరల్, పోలీసు అధికారులకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. తిరుపతి జిల్లాలో మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయని, సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసి ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచే వరకు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకోవాలన్నారు. అర్హులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మలిక గర్గ్ మాట్లాడుతూ గతంలో ఎన్నికల నిబంధనల అతిక్రమణ జరిగిన పోలింగ్ కేంద్రాలు, క్రిమినల్ యాక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నిఘా, బైండోవర్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లా అండ్ ఆర్డర్ పక్కాగా ఉండేలా చూడాలన్నారు. జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ మాట్లాడారు. అనంతరం ఈవీఎం ఆపరేషన్‌పై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ పాటిల్‌దేవ్‌రాజ్‌మనీష్, ఏఎస్పీ వెంకట్రావు, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రామ్మోహన్, మాస్టర్ ట్రైనర్స్ కోదండ రామిరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ కళాశాల యూజీ హాస్టల్లో

మత్తు పదార్థాలు, కండోమ్ ప్యాకెట్లు

● స్వాధీనం చేసుకున్న పోలీసులు



తనిఖీలు చేసి బయటకు వస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17: తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల అండర్ గ్రాడ్యుయేట్ మెన్స్ హాస్టల్లో మత్తుపదార్థాలను, కండోమ్ ప్యాకెట్లను వెస్ట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజులక్రితం హాస్టల్లో ర్యాగింగ్ కారణంగా రెండు వర్గాలుగా విడిపోయిన విద్యార్థుల మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. అలాగే ఓ యువతి విషయమై విద్యార్థులు ఘర్షణ పడ్డట్టు సమాచారం. హాస్టల్ విద్యార్థుల మధ్య తరచుగా గొడవలు జరుగడానికి విద్యార్థులు విరివిగా వాడుతున్న కొన్ని రకాల మత్తుపదార్థాలు కూడా ఓ కారణమని మెడికల్ కళాశాల అధికారులు గుర్తించారు. దీంతో వారు విద్యార్థులకు కౌన్సిలింగ్ చేశారు. గత ఆగస్టు నెలలో వెంకటగిరికి చెందిన ఓ జూనియర్ విద్యార్థి , మరో ఇద్దరు సీనియర్ విద్యార్థులు కలిసి మద్యం సేవించి ఆపై గొడవపడ్డారు. ఈ విషయమై తరువాత జూనియర్ విద్యార్థి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మెడికల్ కళాశాల అధికారులు హాస్టల్లో తనిఖీలు చేయించినట్టు తెలుస్తోంది. మెడికల్ కళాశాల అధికారుల విజ్ఞప్తి మేరకు వెస్ట్ పోలీసులు, కళాశాల సెక్యూరిటీ సిబ్బంది, మెడికల్ అధికారులు కలిసి తనిఖీలు చేశారు. హాస్టల్లోంచి ఎవరూ బయటకు పోకుండా, బయటివారెవరూ లోపలికి రాకుండా హాస్టల్ ప్రధాన గేట్‌కు తాళాలు వేసి మరీ తనిఖీలు నిర్వహించారు. ఓ గదిలో మత్తుపదార్థాలను, కండోమ్ ప్యాకెట్లను గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐతే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. సీఐ జయనాయక్‌ను తనిఖీల విషయమై అడగ్గా అదంతా పుకారు మాత్రమే అని చెప్పారు.

పోలీసులు నిర్లక్ష్యం వీడాలి

ఇటీవల ఎస్వీ మెడికల్ కళాశాల హాస్టల్లో విద్యార్థిలా వచ్చి చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని విద్యార్థులే పట్టుకుని వెస్ట్ పోలీసులకు అప్పగించినా చర్యలు తీసుకోకుండా మందలించి వదిలేశారు. అంతకుముందు రుయాస్పత్రిలో కొందరు పోలీసులపై తిరగబడ్డారు.వారు వైసీపీ మద్దతుదారులు కావడంతో చర్యలు తీసుకోకుండా వదిలేశారు. ఇకనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



గేట్లకు తాళం వేసి తనిఖీలు చేస్తున్న అధికారులు



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

కళ్లకు గంతలతో జూనియర్ డాక్టర్ల నిరసన

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : ఐదు నెలలుగా రావాల్సిన స్టైఫండ్ చెల్లించాలని కోరుతూ రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. నిత్యం వైద్యుల సేవలో ఉండే తాము స్టైఫండ్‌పైనే ఆధారపడి చదువుకుంటున్నామని, అలాంటిది ఐదు నెలలుగా రాకపోవడంతో ఖర్చులకు సైతం తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ విషయమై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు సోమవారం లోపు వారికి స్టైఫండ్ చెల్లించాలని డీఎంఈను ఆదేశించారు. దీంతో జూడాలు ఆందోళన విరమించారు.

స్విమ్స్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్‌కు రెండు అవార్డులు



మాధవిని అభినందిస్తున్న డైరెక్టర్ కుమార్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17 : స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవికి రెండు ప్రత్యేక అవార్డులు దక్కాయి. ఈనెల 3, 4 తేదీల్లో జైపూర్‌లో జరిగిన ఫిజియో సమ్మిట్ కాన్ఫరెన్స్, 16, 17 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లో జరిగిన మొదటి ఫిజియో కాన్ఫరెన్స్‌లలో ఆమె ఈ అవార్డులు అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జైపూర్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ మాధవి వ్యాయామ కట్టుబాట్లను మెరుగుపరిచేందుకు చర్యలు అనే అంశంపై ప్రసంగించినందుకు గాను ఇన్‌స్టీన్ జెరోమ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. ధార్వాడ్ కాన్ఫరెన్స్‌లో ఫిజియోథెరపి రంగంలో విస్తరించిన పరిపాలనా సేవలు అనే అంశంపై చేసిన ప్రసంగానికి ఫిజియోరత్న అవార్డును అందుకున్నారు. ఆమెను స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ అభినందించారు.

గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు ప్రారంభం



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 17: గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏడు రోజులపాటు పుష్కరిణిలో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం మాడవీధుల్లో ఊరేగింపు ఉంటుంది. తొలి రోజు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి తెప్పలపై విహరించారు. రాత్రి 8.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. పుష్కరిణిని టీటీడీ విద్యుత్ దీపాలతో, తోరణాలతో అలంకరించింది. హిందూధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజక్టు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల సంగీత ప్రదర్శన



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 17: అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న సాంస్కృతిక ఉత్సవాలలో భాగంగా సునాదవాణి సాంస్కృతిక సంస్థకు చెందిన చిన్నారుల సంగీత ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ఐదు నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన బాలబాలికలు ఆలపించిన గోవిందనామాలు, విష్ణు సహస్రనామాలు, ఆదిత్యహృదయం, హనుమాన్ చాలీసా, లక్ష్మీ అష్టోత్తర స్తోత్రం వీక్షకులకు వీనులవిందు చేశాయి.

చంద్రబాబు సీఎం కావాలని దివ్యాంగుడి పాదయాత్ర



జీవన్ కుమార్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17: చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని పెరుమాళ్లపల్లెకు చెందిన టీడీపీ అనుబంధ దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవన్‌కుమార్‌రెడ్డి శ్రీవారిని వేడుకున్నా రు.శనివారం ఆయన శ్రీవారి మెట్టు మార్గాన తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

పంచాయతీ అనుమతి లేకుండా వైసీపీ జెండా దిమ్మె ఏర్పాటు

● పుదిపట్లలో సర్పంచ్ ఆందోళన



దిమ్మె తొలగించాలని పోలీసులతో సుధాయాదవ్ వాగ్వాదం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17:తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా వైసీపీ జెండా దిమ్మె రాత్రికి రాత్రి ఏర్పాటు చేయడంపై సర్పంచ్ బడి సుధాయాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి పుదిపట్లలో టీడీపీ జెండా దిమ్మెకు అడ్డుగా వైసీపీ జెండా దిమ్మెను నిర్మించారు.ఈ విషయం తెలుసుకున్న సుధాయాదవ్ శనివారం ఉదయం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పుదిపట్ల పంచాయతీలో అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ కుట్ర చేస్తోందన్నారు. దిమ్మెను తొలగిస్తే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి చెవిరెడ్డి సామ్రాజ్యం కాదని, ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న సంగతి మర్చిపోయి ఇష్టాసారంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. తక్షణం వైసీపీ జెండా దిమ్మెను తొలగించాలని,లేకపోతే తాము కూడా గ్రామంలో పూలే, అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలను వైఎస్ విగ్రహానికి అడ్డంగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం సిమెంట్, ఇటుకలను సిద్ధం చేసుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అటు సుధాయాదవ్‌తో, ఇటు వైసీపీ నాయకులతో సంప్రదించారు. పంచాయతీ అనుమతి తీసుకుని దిమ్మె ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చెప్పడంతో వైసీపీ వారే దిమ్మెను తొలగించారు.

వైసీపీకి లేని నిబంధనలు మాకే ఎందుకు?

● టీడీపీ ఇన్‌ఛార్జి నానీ ప్రశ్న



టీడీపీ శ్రేణులతో నాని ధర్నా

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 17: వైసీపీకి లేని నిబంధనలు టీడీపీకి మాత్రమే ఎందుకని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని నిలదీశారు. తిరుపతి రూరల్ మండలంలో అనుమతులు లేవంటూ టీడీపీ వాల్ పోస్టర్లను తొలగించడాన్ని నిరసిస్తూ టీడీపీ, జనసేన నాయకులతో కలిసి రూరల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సొంత డబ్బులతో వారి ఇళ్లకు స్టిక్కర్లు వేసుకుంటే తొలగిస్తున్నారన్నారు. గత నెల 28వ తేదీన అన్ని పంచాయతీల్లో పోస్టర్ల ఏర్పాటుకు అనుమతి కోరామన్నారు. కలెక్టర్, డీపీవో, ఎంపీడీవోలకు కూడా అనుమతి కోసం వినతిపత్రాలు అందజేశామన్నారు. ఎలాంటి సమాధానం చెప్పకుండా పంచాయతీ సెక్రటరీలు టీడీపీ స్టిక్కర్లను తొలగిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే బెంచీలు, సూచిక బోర్డులు, బ్యానర్లకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. 139 పంచాయతీల్లో వైసీపీ దిమ్మెల నిర్మాణం చేపట్టారని , వాటికి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఏ పార్టీ అయినా ముందస్తు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టిక్కర్లు వేసుకోరాదని పంచాయతీ కార్యదర్శులకు జారీచేసిన ఉత్తర్వులను నానీకి ఎంపీడీవో రమేష్‌బాబు అందజేయడంతో ఆందోళన విరమించారు. తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు బిరుదాల భాస్కరరెడ్డి, మునిశేఖర్‌రాయల్, మధు, పెరుగు భాస్కరరెడ్డి, శ్రీహరినాయుడు, జయరామిరెడ్డి, కరాటే చంద్ర, ఈశ్వరయ్య, ముంతాజ్, కళావతి, మహేశ్వరి, లలిత, హేమలత, సుధాకర్, చంద్రశేఖర్, ఢిల్లీరాజు, ముని, వెంకటేష్, ప్రతాప్‌చౌదరి, ప్రకాష్, ప్రతాప్, మణి, కవిత, శాంతమ్మ, ధనరాయల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖకు మొదటిస్థానం గర్వకారణం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి17 : జిల్లా వ్యవసాయ శాఖలో ప్రభుత్వ పథకాల అమలు తీరుకు మొదటిస్థానం దక్కడం గర్వంగా ఉందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ రబీ ప్రధాన పంట వరి రెండు లక్షల ఎకరాల్లో సాగవుతోందన్నారు. జిల్లాలో ప్రతి పంటకూ వందశాతం ఈ క్రాపింగ్, ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందన్నారు. అనంతరం చిరుధాన్యాలతో వంటల పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, సెరికల్చర్ అధికారి గీతారాణి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్, నీటిపారుదల శాఖాధికారి వెంకటరమణ, వ్యవసాయ సలహామండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీకాం కాలేజీకి అవార్డు



రోహిత్‌శర్మ నుంచి అవార్డు అందుకుంటున్న సీకాం డైరెక్టర్లు తేజస్వరూప్, ప్రణీత్ స్వరూప్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి17: తిరుపతికి చెందిన సీకాం డిగ్రీ కళాశాలకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. విద్యారంగంలో 44సంవత్సరాలుగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా లియో-వన్ సంస్థ ఆధ్వర్యంలో అవుట్‌స్టాండింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్-2కే24 అవార్డును ప్రదానం చేశారని కళాశాల చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సంస్థ సీఈవో, భారత క్రికెట్ కెప్టెన్ రోహిత్‌శర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కళాశాల డైరెక్టర్లు టి.తేజస్వరూప్, టి.ప్రణీత్ స్వరూప్ అందుకున్నారు. కాగా కోకరిక్యులర్ యాక్టివిటీ విభాగంలో 2023లో కూడా ఈ విద్యాసంస్థ ఇంటర్నేషనల్ స్కూల్ అవార్డును కైవసం చేసుకుంది. అవార్డులు దక్కడం సంతోషంగా ఉందని సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

తిరుమలలో తమిళుడి మృతి



తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో 56 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. శనివారం ఉదయం 6 గంటలకు ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కదలిక లేకుండా ఉండటాన్ని విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద లభించిన ఓ బ్యాగులో గత నెల 3వ తేదీన వేలూరులోని ప్రభుత్వాస్పత్రిలో తీసుకున్న ఎక్స్‌రే లభించింది. అందులో శరవణన్ (56) అని మాత్రమే ఉంది. ఇతర గుర్తింపు కార్డులు, బంధువులు ఎవరు లేకపోవడంతో తిరుమల వన్‌టౌన్ పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877-2263654, 94407 96771లకు తెలియజేయాలని కోరారు.

ఎస్జీఎస్ కాలేజీలో డిజి లాకర్ రిజిస్ట్రేషన్

తిరుపతి(విద్య),ఫిబ్రవరి17: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో చదివే విద్యార్థులకు డిజి లాకర్ సర్వీస్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా ప్రచారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశ పౌరుల కోసం ప్రవేశపెట్టిన డిజి లాకర్ సర్వీసును విద్యార్థులకు నమోదు చేయించినట్లు వివరించారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను డిజిలాకర్‌లో పొందుపరచవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చంద్రశేఖరులునాయుడు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పరమేశ్వర, ఇంటర్న్‌షిప్ నోడల్ ఆఫీసర్లు చంద్రయ్య, శివకుమార్, సృజన పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయండి

పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి



తిరుపతి(విద్య),ఫిబ్రవరి17: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ఈ విషయంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు బాధ్యతగా పనిచేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ పాఠశాల విద్యలో వచ్చిన మార్పులకనుగుణంగా విద్యను బోధించాలన్నారు. ప్రతి అధికారికీ నిర్దేశించిన జాబ్‌చార్ట్ ప్రకారం నడుచుకుని పాఠశాల విద్యను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ గతేడాది టెన్త్ ఫలితాల్లో జిల్లా 8వ స్థానంలో నిలచిందని, ఈ ఏడాది ప్రథమ స్థానం సాధించేందుకు హెచ్‌ఎంలు, టీచర్లు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పి.గురుస్వామిరెడ్డి, తిరుపతి డీవైఈవో ఎం.ఆనందరెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డ్ కార్యదర్శి(డీసీఈబీ) సెక్రటరీ ఆర్.వంశీరాజా, సీఎంవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 77,483 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,276 మంది తలనీలాలు సమర్పించారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్14 నమూనాకు ప్రత్యేక పూజలు

తిరుమల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జీఎస్ఎల్వీ-ఎఫ్14 నమూనాకు శనివారం తిరుమలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ప్రయోగానికీ ముందు ఇస్రో శాస్త్రవేత్తలు తిరుమలకు వచ్చి నమూనాకు ప్రత్యేక పూజలు చేయించడం అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఇస్రో సైంటిఫిక్ సెక్రటరీ శాంతాను భట్వదేకర్, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్తా జీఎస్ఎల్వీ-ఎఫ్14 నమూనాతో శనివారం వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాత సేవలో పాల్గొన్నారు. నమూనాను స్వామి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేయించి, ప్రయోగం విజయవంతం కావాలని కోరారు.

లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బదిలీ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 17: తిరుపతి లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావుకు స్థానచలనం కలిగింది. డిప్యూటేషన్‌పై జలవనరుల శాఖలో పునరావాస విభాగం, విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎం.ఎస్.మురళి నియమితులయ్యారు. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైసీపీ నేతలు ప్రైవేట్ భూములు కబ్జా చేస్తున్నారు

కందారపు మురళి - సీపీఎం నేతకు మద్దతుగా టీడీపీ, జనసేన



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు - కట్టడాలను కూల్చుతున్న నేతలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి17: తిరుచానూరులోని ప్రైవేట్ భూములను వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారని సీపీఎం నేత కందారపు మురళి ఆరోపించారు. తిరుచానూరు లెక్క దాఖలా సరస్వతి నగర్‌లోని సర్వే నెంబరు 260లో సీపీఎంకు చెందిన సుమన్ తండ్రి పెరుమాళ్ పేరుపై ఉన్న 220 అంకణాల స్థలంలో తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి తమ్ముడు వైసీపీ ఎంపీటీసీ నరేష్, వారి అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సీపీఎం నేతలు శనివారం కబ్జా జరుగుతున్న ప్రాంతంలో నిరసన తెలిపారు. నిరసనకు టీడీపీ నాయకులు మధు, జనసేన కార్యకర్తలు మద్దతుగా నిలబడ్డారు. సీపీఎం కార్యకర్తలు, నాయకులు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. సీపీఎం, టీడీపీ, జనసేన జెండాలు ఈ ప్రాంతంలో నాటారు. ఈ సందర్భంగా బాధితులు ప్రైవేట్ స్థలాల్లో 'వైసీపీ భూ కబ్జాలను వ్యతిరేకించండి.. వైసీపీ అక్రమాలను ఎదుర్కోండి.. వైసీపీ డైన్ డౌన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. స్వయంగా ఏఎస్పీ, సీఐలు కట్టడాలను ఆపమని చెప్పినా ఏమాత్రమూ లెక్క పెట్టకుండా కొనసాగిస్తున్నారంటే అధికార పార్టీ నేతల జోక్యం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చన్నారు. బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని, ఏఎస్పీకి, తిరుచానూరులో పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చేతులెత్తేసిన పరిస్థితి కనిపిస్తోందని మండిపడ్డారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసి కట్టడాలను ఆపి వేస్తామన్నారు. ఈ భూమిపై ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ కార్యక్రమంలో సీపీఎం తిరుపతి నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, సాయిలక్ష్మి, రాధాకృష్ణ, బుజ్జి, శేషాద్రి, మునిశేఖర్, టీడీపీ నాయకులు కిషోర్, మునిరత్నం, హరిరాం, సుధాకర్, కరిముల్లా, జీవన్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఎంప్లాయిస్ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చీర్ల కిరణ్



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 17: ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

గీతా మకరంద గుళికలు పుస్తకావిష్కరణ నేడు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 17: పాకాల మండలం పత్తిపాటివారిపల్లెకు చెందిన విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు రచించిన గీతామకరంద గుళికలు(శ్రీమద్భగవద్గీతకు తెలుగుసేత) పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నారు. విశ్వశ్రీసాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎస్వీయూ తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహిస్తారు. డాక్టర్ మేడసానిమోహన్ పుస్తకావిష్కరణ చేస్తారు. శతావధాని ఆముదాల మురళి గ్రంథ పరిచయం చేస్తారు.

మేకల బండ నవల

ప్రముఖ కథా, నవలా రచయిత ఆర్.సి.కృష్ణస్వామిరాజు రచించిన మేకలబండ నవలను ఆదివారం ఆవిష్కరించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు యశోదానగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఎస్వీబీసీ సంచాలకులు, సంగీత అవధాని వి.బి.సాయికృష్ణ యాచేంద్ర పాల్గొంటారు. పుస్తకాన్ని శ్వేత సంచాలకులు భూమన్ ఆవిష్కరిస్తారు. ఎస్వీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ సమీక్షిస్తారు.

ఫైబర్‌తో రాయల్ విగ్రహం ఏర్పాటా?

బలిజ నాయకుల మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న బలిజ సంఘ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి) : లీలామహల్ సర్కిల్లో గతంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం తొలగించి ఎన్నికల వేళ హడావుడిగా ఫైబర్ (ఎఫ్ఆర్పీ) మెటీరియల్‌తో తయారు చేసిన విగ్రహం ఏర్పాటు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. బలిజ, కాపు కులస్థుల మనోభావాలను దెబ్బతీసేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని జిల్లా బలిజ కులస్థుల సంక్షేమ సంఘం మండిపడింది. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సంఘ నాయకులు గుట్టా నాగరాజు రాయల్, సరితా నాగరాజు రాయల్, సింగం శెట్టి సుబ్బరామయ్య మాట్లాడుతూ గరుడ వారధి నిర్మాణంలో భాగంగా ఇదివరకు ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని తొలగించి ప్రకాశం పార్కులో పెట్టారన్నారు. వారధి పూర్తి కాగానే అదే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అప్పటి కమిషనర్ గిరీష హామీ ఇచ్చారన్నారు. శుక్రవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించిన విగ్రహాన్ని పరిశీలిస్తే, ఫైబర్‌తో తయారు చేసినట్టు గుర్తించామన్నారు. ఎన్నికల సమయంలో బలిజల ఓట్లు కోసమే విగ్రహాన్ని ఆవిష్కరించినట్టుగా ఉందన్నారు. గతంలో ఉన్న కాంస్య విగ్రహమైనా లేదా ఎస్వీ శిల్ప కళాశాలలో సిద్ధంగా ఉన్న రాతి విగ్రహాన్నైనా పునః ప్రతిష్ఠించాలన్నారు. విగ్రహాల ఏర్పాటులోనూ నిధులు స్వాహా చేస్తున్నారని ధ్వజమెత్తారు. బలిజ సంఘ నాయకులు ఆర్వీ శ్రీనివాసులు, తమ్మిశెట్టి మురళి, పసుపులేటి విజయకుమార్, కంబళ్ల జనార్దన్, హేమంత్ కుమార్, కొండా రాజమోహన్, వెంకట్, డాక్టర్ కరుణానిధి, డాక్టర్ జిఎస్ ప్రసాద్, చింతకాయల కృష్ణయ్య, బండ్ల లక్ష్మీపతి పాల్గొన్నారు.

బస్టాండులో బ్యానర్ల తొలగింపు



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 17: తిరుపతి సెంట్రల్ బస్టేషన్‌లో అనధికారంగా ఉన్న ప్రచార బ్యానర్లను శనివారం ఉదయం అధికారులు తొలగించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'బస్టాండులో సొంత ప్రచారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు తక్షణమే బ్యానర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శ్రీనివాసం బస్టాండు గోడలకు, తిరుపతి డిపో ప్రధాన గేటుకు ఇరువైపులా ఉన్న బ్యానర్లను తీసివేశారు.

పదోన్నతుల్లో లైబ్రేరియన్స్, పీడీలకు అన్యాయం

లైబ్రరీ సైన్స్ అధ్యాపకుల జిల్లా అధ్యక్షుడు బాబూరావు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి17 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌కి చేపట్టిన పదోన్నతుల్లో లైబ్రేరియన్స్ పీడీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా లైబ్రరీ సైన్స్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎస్.బాబూరావు, ఇందుశేఖర్ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం జూనియర్ కాలేజీల్లో లైబ్రేరియన్స్, పీడీలకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించేందుకు 2021లో జీవో వెలువరించిందని, దీనికి అనుగుణంగా జూనియర్ అధ్యాపకులు, లైబ్రేరియన్స్, పీడీలతో కలపి ఇంటిగ్రేటెడ్ ప్రొవిషనల్ సీనియారిటీని ఆయా క్యాడర్లకు ప్రిన్సిపాల్స్ ద్వారా కమ్యూనికేట్ చేశారని గుర్తు చేశారు. జూనియర్ అధ్యాపకుల అభ్యంతరాలను కూడా ప్రభుత్వానికి నివేదించిందని తెలిపారు. అందుకనుగుణంగా జీఏడీ సర్వీసెస్ వారు ఫైనల్ చేయమని ఆదేశించినా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కాగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అధ్యాపకులకు రాజకీయ పలుకుబడితో పదోన్నతులు కల్పిస్తున్నారని, దీనివల్ల తమకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. లైబ్రేరియన్స్ ఏపీ సర్వీస్ కమిషన్ ద్వారా డైరెక్ట్ కోటా ద్వారానే నియమించారన్న ప్రాథమిక సూత్రాన్ని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు విస్మరించడం బాధాకరమన్నారు.

వెల్డింగ్ షాపుల స్థలాలపై స్టేటస్‌కో



మీడియాతో మాట్లాడుతున్న ఆటోనగర్ బాధితులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 17: ఆటోనగర్‌లోని వెల్డింగ్ షాపులకు కేటాయించిన స్థలాలలో తుడా అధికారులు చేపట్టిన నిర్మాణాలపై హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని శ్రీవేంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ సభ్యులు కుమార్, మహేష్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ప్రభుత్వం వెల్డింగ్ షాపులకు కేటాయించిన స్థలాలను అధికారులు ఇష్టానుసారంగా మారుస్తూ 26ఏళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ సిటీ పేరుతో వేధించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలోనే ప్లాట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరు సింధూజ మాట్లాడుతూ గతంలో వెల్డింగ్ షాపులకు కేటాయించిన స్థలాలను వారికి ఇవ్వకుండా తాత్సారం చేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో గోవిందు, హబీబ్, జయరాం, గోపాల్, శ్రీహరిరెడ్డి, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయొద్దు



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీజేఏసీ, ఎన్జీవోస్ నాయకులు

తిరుపతి(రవాణా), ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీజేఏసీ, ఏపీఎన్జీవోస్ నేతలు సురేష్, నిర్మల కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై నాలుగు రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన అరియర్స్‌ను ఇవ్వకపోగా వారు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐను ప్రభుత్వం ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వాడుకోవడం అన్యాయమన్నారు. ఈనెల 26వ తేదీలోపు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోతే 27న చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. కాగా, ఉద్యమం ప్రారంభించిన రోజే ఏపీ ఎన్జీవో నేతలు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జితో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ఊహించిన స్థాయిలో ఉద్యోగులు హాజరుకాలేదన్న విమర్శలున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ నగర కార్యదర్శి బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, ఎస్టీయూ కార్యదర్శి వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

పదిరోజుల్లో పూర్తిగా కోలుకున్న బాధితుడు



విద్యార్థితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 17: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి అత్యంత సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆయన శనివారం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్‌కుమార్ ద్వివేది స్థానిక వేదిక్ యూనివర్సిటీలో ఎంఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న యూనివర్సిటీ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని తలభాగంలోని నుదుటి ఎముకలు దెబ్బతిని, మెదడులోకి చొచ్చుకుపోయాయి. దవడ ఎముకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్విమ్స్‌కు తీసుకురావడంతో న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు 4 గంటలపాటు శ్రమించి అతిక్లిష్టమైన సర్జరీని అధునాతన పరిజ్ఞానంతో విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు. ముఖభాగానికి మునుపటి రూపం తీసుకురావడమే గాక పది రోజుల్లోనే కోలుకునేలా చేయడం అభినందనీయమన్నారు. టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా సర్జరీని పూర్తి ఉచితంగా చేయగలిగామని తెలిపారు. సచిన్ కుమార్ ద్వివేది మాట్లాడుతూ తన ప్రాణం నిలబెట్టిన స్విమ్స్, టీటీడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, ఎంఎస్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ, అనస్థీషియా విభాగాధిపతులు డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్లు అలోక్ సమంత్రే, బీసీఎం ప్రసాద్, వెంకట్, చంద్రశేఖర్, ప్రవీణ్ కుమార్, నాగతేజ, డీడీలు ప్రభావతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎల్లుండినుంచి నారా భువనేశ్వరి పర్యటన

4రోజులపాటు నిజం గెలవాలి కార్యక్రమం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఈనెల 20వ తేదీనుంచి నాలుగు రోజులపాటు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు.స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టు అయినప్పుడు ఆవేదనతో మరణించిన వారి కుటుంబాలను ఆమె పరామర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె 20వ తేదీన మధ్యాహ్నం గుడుపల్లె మండలం కొడతనపల్లె, యామగానిపల్లెల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. అన్న క్యాంటీన్, చర్చి, మసీదులను సందర్శించి ఆ రోజు రాత్రి కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్టహౌస్‌లో బస చేస్తారు.21వ తేదీన శాంతిపురం, రామకుప్పం మండలాల్లో అన్న క్యాంటీన్లను పరిశీలిస్తారు. భోజనానంతరం పెద్దపంజాణి, పుంగనూరు మండలాల్లోని బాధిత కుటుంబాల్ని పరామర్శిస్తారు. ఆ రోజు రాత్రి మదనపల్లెలో బస చేస్తారు.22వ తేదీన పుంగనూరు, పులిచెర్ల, పూతలపట్టు, చిత్తూరు మున్సిపాలిటీ, చిత్తూరు రూరల్ ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు.ఆ రోజు చిత్తూరు నగరంలోనే బస చేస్తారు. 23వ తేదీన ఎస్‌ఆర్‌పురం, నారాయణవనం మండలాల్లోని బాధిత కుటుంబాలను కలుస్తారు.మధ్యలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యార్థులతో సమావేశమవుతారు.అదేరోజు మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు.

బిల్లులు చేసేందుకు లంచం డిమాండ్

సీబీఐకి చిక్కిన రైల్వే ఇంజనీరింగ్ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఒక కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడానికి లంచం తీసుకున్న దక్షిణ మధ్య రైల్వే తిరుపతి సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌తోపాటు అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. కర్నూలులోని ఏసీబీ కేసుల విచారణ న్యాయస్థానంలో హాజరుపరచగా రెండు వారాలు డిమాండ్ విధించింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తిరుపతిలో హెచ్‌ఓజీ కోచ్‌ల వాషింగ్, సిక్ లైన్‌ల నిర్వహణ డిపో కోసం 750 వాట్లల సామర్థ్యం కలిగిన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు రూ.2,56,73,148 విలువైన టెండర్‌ను మైసూరుకు చెందిన కోర్ ఫోర్ ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. గత ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించగా, టెండర్ నిబంధనల ప్రకారం ఆరునెలల్లో పూర్తి చేయాలి. కానీ పలు కారణాల వల్ల జనవరి 2024 నాటికి పని పూర్తయింది. పనులు పూర్తయినట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఈఐజీ సర్టిఫికెట్ కూడా జారీ చేశారు. పూర్తిచేసిన పనులకు సంబంధించిన సుమారు రూ.1.99 కోట్లు బిల్లు కాంట్రాక్టర్ అందుకున్నారు. ఇదిలా ఉండగా బిల్లులు చేయడానికి సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) గంటా రామమోహన్‌రావు, మరికొందరు తమను లంచాల కోసం వేధించారని, తాము ఇవ్వకపోవడంతో చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో ట్రెంచింగ్ పనులు, బోరు వేయాలని, అప్పుడే మిగిలిన బిల్లు చెల్లిస్తామని చెబుతున్నారంటూ ఈ నెల 15న కోర్ ఫోర్ ఇంజనీర్స్ సంస్థ సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేసింది. సీబీఐ అధికారుల సూచన మేరకు పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గంటా మోహనరావుకు రూ.40 వేలు, అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ అప్పలరాజుకు రూ.20 వేలు లంచం ఇస్తుండగా సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపైనా కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. అదేసమయంలో వారి కార్యాలయం, ఇళ్లలో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించి కొన్ని డాక్యుమెంట్లను సీజ్ చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 77,483 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,276 మంది తలనీలాలు సమర్పించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైలు ఢీకొని ఒకరి మృతి


గూడూరు, ఫిబ్రవరి 17: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని దివిపాళెం గ్రామ సమీపంలో రైల్వేగేటు వద్ద శనివారం ఓ వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... చిల్లకూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ(45) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శనివారం దివిపాళెం రైల్వేగేటు వద్ద పట్టాలు దాటుతుండగా గూడూరు నుంచి చెన్నై వెళుతున్న పినాకిని ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మృతిచెందాడు. అదేవిధంగా స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులదిబ్బ ప్రాంతం వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని, ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వేజీఆర్ పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం సమీపంలో శనివారం తెల్లవారుజామున 33 కేవీ విద్యుత్ లైను తగిలి లారీ డ్రైవర్ ఏలూరు భాస్కర్(49) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేట మండలం ఇలుపూరు గ్రామానికి చెందిన నాగరాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి వట్రపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్దకు లారీలో ఇసుక తీసుకెళ్లాడు. ఇసుకను దింపేందుకు లారీపై ఉన్న పట్టను తీసేందుకు పైకి ఎక్కాడు. పైన ఉన్న 33 కేవీ విద్యుత్ లైను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రహీంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

చిల్లకూరు, ఫిబ్రవరి 17: మండలంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద శనివారం మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాధిక్ పెద్ద బ్యాగ్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తుండంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. సాధిక్‌ను అరెస్టు చేశారు.



మృతి చెందినా ఓటర్ల జాబితాలో ఉన్న మహదేవయ్య, మునిరత్నయ్య పేర్లు

మృతులందరికీ ఓట్లు

చనిపోయినవారు 200కు పైనే ● అందరికీ జాబితాలో చోటు

కోట, ఫిబ్రవరి 17: కోట మండల పరిధిలోని 21 పంచాయతీల్లో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తుది ఓటర్ల జాబితా ప్రకారం మండలంలో 41,547 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 20,033, స్త్రీలు 20,510 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. అయితే ముసాయిదా జాబితాలోని తప్పులు యథాతథంగా పునరావృతం అయ్యాయి. సుమారు 200 మంది మృతుల ఓట్లు తొలగించలేదు. ఇక ఇంటి నెంబరు లేని ఓటర్లు, డబుల్ ఎంట్రీలు ఎక్కువగానే ఉన్నారు. తిమ్మనాయుడుపాళెంలోని 199వ పోలింగ్ బూత్‌లో 968 మంది ఓటర్లు ఉండగా, అందులో 10 మంది చనిపోయినా వారి పేర్లు తుది జాబితాలో అలాగే ఉన్నాయి. ఈ బూత్‌లో మహదేవయ్య అనే ఓటరు దాదాపు పదేళ్ల క్రితం చనిపోయినప్పటికీ ఓటరు జాబితాలో పేరు కొనసాగుతోంది. అదేవిధంగా వెంకన్నపాళెం 197వ పోలింగ్ బూత్‌లో 890మంది ఓటర్లు ఉండగా, 20 మంది చనిపోయిన వారి పేర్లు తుదిజాబితాలో ఉండటం విశేషం. ఇక్కడ మునిరత్నయ్య అనే ఓటరు మృతి చెందినా జాబితాల్లో పేరు తొలగించలేదు. అదేవిధంగా కోట పట్టణంలోని 201వ పోలింగ్ కేంద్రం పరిధిలో ముగ్గురు, 206వ పోలింగ్ కేంద్రం పరిధిలో పది మంది, 207వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఐదుగురు చనిపోయినా వారి జాబితా నుంచి తొలగించలేదు.

చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన: కురుగొండ్ల



కరపత్రాలు అందజేస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో రామరాజ్య స్థాపన చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 4వ వార్డు కుమ్మరి మిట్ట, రహమత్ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టును, వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే అస్త్రంతో ముఖ్యమంత్రి సైకో జగన్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, తాండవ చంద్రారెడ్డి, మల్లారం బాబు, సుధా, రవి, రుద్రాక్ష, కౌశల్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 17: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 విజయం కోసం

చెంగాళమ్మకు పూజలు



ఇస్రో చైర్మన్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని శనివారం ఇస్రో చైర్మన డాక్టర్ ఎస్.సోమనాథ్ దర్శించుకొన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారికి పూజలు చేశారు. ఇస్రో చైర్మన్‌కు ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర రెడ్డి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వెలుపల ఇస్రో చైర్మన్ విలేకర్లతో మాట్లాడుతూ జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ద్వారా వాతావరణ అధ్యయనం కోసం ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపుతున్నామన్నారు. కౌంట్‌డౌన్ ప్రారంభమై సజావుగా సాగుతోందని తెలిపారు. జూన్ మాసంలో మరో జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహ ప్రయోగం ఉంటుందన్నారు. అదే విధంగా ఎస్ఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ ప్రయోగాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

బాబును సీఎం చేసి... రాష్ట్రాన్ని కాపాడుకుందాం: పాశిం



ఆలేటిపాడులో కరపత్రాలను అందజేస్తున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఫిబ్రవరి 17: చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని కాపాడుకుందామని గూడూరు టీడీపీ ఇన్‌చార్జి పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆలేటిపాడు గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం కోసం ఎంతటి దుర్మార్గానికైనా పాల్పడుతారని అన్నారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమం కోసం పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య, రషీద్, కల్లూరు మణి, మోహన్ తదితరులు ఉన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, ఫిబ్రవరి 17: గూడూర కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీధర్, సులోచనారాణి, లోకనాధం, శంకరయ్య, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో బాధ్యతగా పనిచేయండి

సెక్టోరల్, పోలీసు అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



ఎన్నికల సెక్టార్ అధికారులు, పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17: రాబోయే ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్, పోలీసు అధికారులు అత్యంత బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎన్నికల సెక్టోరల్, పోలీసు అధికారులకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. తిరుపతి జిల్లాలో మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయని, సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసి ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచే వరకు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకోవాలన్నారు. అర్హులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మలిక గర్గ్ మాట్లాడుతూ గతంలో ఎన్నికల నిబంధనల అతిక్రమణ జరిగిన పోలింగ్ కేంద్రాలు, క్రిమినల్ యాక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నిఘా, బైండోవర్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లా అండ్ ఆర్డర్ పక్కాగా ఉండేలా చూడాలన్నారు. జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ మాట్లాడారు. అనంతరం ఈవీఎం ఆపరేషన్‌పై అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ పాటిల్‌దేవ్‌రాజ్ మనీష్, ఏఎస్పీ వెంకట్రావు, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రామ్మోహన్, మాస్టర్ ట్రైనర్స్ కోదండరామిరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బదిలీ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 17: తిరుపతి లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావుకు స్థానచలనం కలిగింది. డిప్యూటేషన్‌పై జలవనరుల శాఖలో పునరావాస విభాగం, విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎంఎస్.మురళి నియమితులయ్యారు. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీసిటీ పరిశ్రమల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



శ్రీసిటీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న చింతామోహన్

సత్యవేడు, ఫిబ్రవరి 17: శ్రీసిటీలోని పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించి రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఇక్కడ పరిశ్రమల్లో కార్మికులకు కనీసం రూ.23 వేలు వేతనం చెల్లించాలన్నారు. అనంతరం శ్రీసిటీ చైర్మన్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాస రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తేజోవతి, నాయకులు నాగరాజు, పూల చంద్రశేఖర్, చందనపూడి రాజేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

మహిళలకు గౌరవభంగం కలిగించరాదు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

నారాయణవనం, ఫిబ్రవరి 17: మహిళలకు గౌరవభంగం కలిగించరాదని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర అన్నారు. శనివారం నారాయణవనంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ మహిళలను తక్కువ చేసి మాట్లాకూడదని, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మహిళలను గౌరవించాలని తెలిపారు. సమాజంలో బాలికలు చైతన్యవంతులుగా ఉండాలని, గుర్తు తెలియని వారి ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 17: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగారాజు డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన గంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు జీవోలు ఇవ్వాలని, లేదంటే మళ్లీ సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఐసీడీఎస్‌కు నిధులు కేటాయించి, అంగన్వాడీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ధనకోటి, లక్ష్మీనరసింహ, పంచవర్ణ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, ఫిబ్రవరి 17: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారు, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 70 మంది ఎంపిక

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 17: పుత్తూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగిన ప్రాంగణ నియామకాల్లో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ కుమార్ తెలిపారు. గ్రీన్ టెక్ కంపెనీకి 40 మంది, అప్పస్వామి అసోసియేట్ కంపెనీకి 30 మంది విద్యార్థులకు ఎంపికయ్యారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గ్రీన్ టెక్ హెచ్‌ఆర్ మేనేజర్ నాగరాజు, అప్పాస్వామి అసోసియేట్ ఏరియా మేనేజర్ జ్యోతిశ్వర్, సేతురామన్, హెచ్‌వోడీలు, టీపీవోలు అభినందించారు.

అందరం కలిసి పుత్తూరును అభివృద్ధి చేసుకుందాం: భానుప్రకాష్



టీడీపీలో చేరిన వారితో భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 17: అందరూ సమష్టిగా పనిచేసి పుత్తూరు పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలోని 18వ వార్డుకు చెందిన కోటకొండ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి భానుప్రకాష్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో ప్రతి వర్గం, ప్రతి కుటుంబం తీవ్రంగా నష్టపోయిందన్నారు. తిరిగి మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబునాయుడు సారథ్యంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో విజ్ఞతతో ఆలోచించి ఓటును వినియోగించుకోవాలని అభ్యర్థించారు. టీడీపీకి మద్దతుగా నిలిచే ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టీడీపీలో చేరిన వారిలో సి.చంద్ర, జి.బొట్టుబాబు, కే.వీరాస్వామి, సి.మణికంఠ, జి.గిరిబాబు, కే.బాలాజీ, హెచ్.సాహుల్ హమీద్, ఎం.షబీర్, ఎస్.శరవణ కుమార్, కే.మునస్వామి, డి.ఉదయ్ శంకర్, ఎల్.జయప్రకాష్, ఓ.ఉపేంద్ర, సి.సుబ్రహ్మణ్యం, సి.కుమార్‌రాజ్, డి.భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తారస్థాయికి అధికార దుర్వినియోగం

వైసీపీ నాయకుల అధికార దుర్వినియోగం తారస్థాయికి చేరుకుందని భానుప్రకాష్ ధ్వజమెత్తారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంతపురంలో వైసీపీ నిర్వహిస్తున్న సిద్ధం సభకు పుత్తూరు ఆర్టీసీ డిపో నుంచి ఏకంగా 41 బస్సులను పంపడం దుర్మార్గమన్నారు. ఉన్న 77 బస్సుల్లో 41 సీఎం సభకు పంపిస్తే ప్రయాణికుల పరిస్థితి ఏమవుతుందనే ఇంగితజ్ఞానం కూడా ఈ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. పైగా వైసీపీ సభకు వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు విముఖత వ్యక్తం చేయడంతో బస్సులన్నీ ఖాళీగా వెళుతున్నాయని విమర్శించారు. కేవలం బస్సుల లెక్క చూపేందుకే మంత్రి రోజా తాపత్రయ పడుతున్నారని ఎద్దేవా చేశారు. వడమాలపేట మండల పరిధిలోని పాదిరేడులో టీటీడీ నిధులతో కొనుగోలు చేసిన భూముల్లో మంత్రి రోజా భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపణలు గుప్పించారు. సుమారు 70 ఎకరాల డీకేటీ భూములను తన బినామీల పేరిట పట్టా సృష్టించి టీటీడీ విడుదల చేసే నిధులను తన ఖాతాలో జమ చేసుకుందని విమర్శించారు. ఒకవైపు దేవుడి సొమ్ము అప్పనంగా బొక్కేస్తూ మరోవైపు వారానికొకసారి తిరుమల యాత్ర చేస్తోందని దుయ్యబట్టారు. మంత్రి రోజా అవినీతి మొత్తం నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పితీరుతారని స్పష్టం చేశారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ జేఏసీ సభ్యులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 17: బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ చైర్మన్ గిరి ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్ ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జీపీఎఫ్‌వో, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ నగదును చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మధ్యంతర భృతి 30 శాతం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ఎస్టీయూ నాయకులు కేశవులు, ఏపీఎన్‌జీవో కార్యదర్శి శశిధర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ లోకనాథం, ట్రెజరర్ నాగజ్యోతి, వైస్ ప్రెసిడెంట్ కాత్యాయని, మురళి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యూలైన్ల ఏర్పాట్లపై కసరత్తు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అవసరమైన క్యూలైన్ల ఏర్పాటుకు కసరత్తు చేశారు. ఈ మేరకు శనివారం ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు అధికారులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. మహాశివరాత్రి రోజున గత ఉత్సవాల్లో అమలు చేసిన క్యూలైన్ల విధానంపై చర్చించారు. ఈ ఏడాది భక్తుల రద్దీ క్యూలైన్ల సవరణపై కసరత్తు చేశారు. అలాగే పార్కింగ్, భక్తులకు అవసరమైన వసతుల కల్పనపై అధ్య యనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ నూకరత్నం పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఇస్రో శాస్త్రవేత్తలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని శనివారం ఇస్రో శాస్త్రవేత్తలు దర్శించుకున్నారు. శ్రీహరికోటలోని ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ లాంచింగ్ చేసే ముందు ముక్కంటి ఆలయాన్ని దర్శించుకోవడం సెంటి మెంట్‌గా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రాకెట్ ప్రయోగం ఉండడంతో శనివారం ఉదయం పలువురు సైంటిస్టులు ముక్కంటి ఆశీస్సులు పొందారు. ఆలయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున ప్రసాద్ వీరికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏరాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కార్యక్రమాలు తగదు

సత్యవేడు, ఫిబ్రవరి 17: ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీ కార్యక్రమాల నిర్వహణ తగదని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో చంద్రశేఖర్‌కి శనివారం వినతిపత్రం అందించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరగనున్న 'సిద్ధం' బహిరంగ సభకు సంబంధించి జన సమీకరణపై వైసీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో వైసీపీ నేతలతో సమావేశమైనట్లు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై సత్యవేడు బీజేపీ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరులు, నరేంద్రబాబు, మోహన్ బాబు, దినకర్, మీరా హుస్సేన్, మండల అధ్యక్షుడు మునిప్రతాప్ తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

దళితులకు భూములు పంచాలి : సీపీఎం



ధర్నా చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 17: మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలో సర్వే నెంబరు 81లో ఉన్న మిగులు భూములను దళితులకు పంచాలని సీపీఎం నాయకులు రమణయ్య కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 81 సర్వే నెంబరులో మిగులు భూములను ప్రస్తుతం దళితులే సాగుచేసుకుంటున్నారని వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు.

చెరకు తోట దగ్ధం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 17: పిచ్చాటూరు మండలంలోని నీరువాయి గ్రామానికి చెందిన సుదర్శన్‌నాయుడుకి చెందిన 4.5 ఎకరాల చెరకు తోట శుక్రవారం రాత్రి దగ్ధమైంది. సుమారు రూ2లక్షల వరకు నష్టపోయినట్లు రైతు వాపోయాడు. అలాగే పీవీసీ పైపులు కూడా కాలిపోయాయని ఆవేదన వ్యక్తంచేశాడు. విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందా లేక ఎవరైనా బీడి, సిగరెట్లు తాగి పడేయడంతో ప్రమాదం జరిగిందో తెలియడం లేదని రైతు విచారం వ్యక్తం చేశాడు.

పీఎంశ్రీ పనుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పనులను జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త శ్రీధర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి సారథిలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం కింద జిల్లాలోని 23 పాఠశాలలు ఎంపిక కాగా అందులో బీఎన్‌కండ్రిగ పాఠశాలకు మొదటి విడతలో రూ.లక్ష మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులత పాఠశాలలోని ఆటస్థలాన్ని బాగు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: మృతుని కుటుంబానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం నిత్యవసర సరుకులు వితరణ చేశారు. శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి పంచాయతీలోని కొత్తూరు ఎస్టీ కాలనీ చెందిన సుబ్రమణ్యం ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో శనివారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆకుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్య వల్లెమ్మకు 52 రకాల నిత్యవసర సరుకులు అందజేశారు. అనంతరం గ్రామంలోని కొంతమంది ఆయన సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, శ్రీను, మూర్తి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారం

తొట్టంబేడు, ఫిబ్రవరి 17: ఎమెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి శనివారం తొట్టంబేడు మండలంలోని చేమూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మల, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ గురవారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదు



తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమ స్యలు పరిష్కరించే వరకు జేఏసీ ఉద్యమం ఆగదని జిల్లా పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి, శ్రీకాళహస్తి తాలూకా జేఏసీ అధ్యక్షులు చెంచురత్నం యాదవ్ స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు శ్రీకాళహస్తి తహసీ ల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు తమ సమస్య లను పరిష్కరించాలని మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలన్నారు. ఒకటో తేదీన జీతాలు తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సరెండర్ లీవ్‌ల నగదు ఇప్పటి వరకు మంజూరు చేయలేదన్నారు. ఈ నెల 21వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేస్తామన్నారు. 27వ తేదీ చలో విజయవాడ కార్య క్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ జేఏసీ కార్యదర్శి సూర్యప్రకాష్ మాట్లా డుతూ 12వ పీఆర్‌సీ కమిషన్‌కు ఎవరిని నియమించారో ఇప్పటివరకు తెలియజేయకపోవడం ప్రభుత్వ మోసకారి తననానికి నిదర్శనం అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గుణశేఖర్, నాగరాజు, నాయకులు శివకుమార్, మోహన్‌బాబు, విజయ్‌కుమార్, భాస్కర్, గిరిధర్, మురళి, సుధాకర్, గోపాల్, వెంకటాద్రి, వెంకయ్య, గణేష్, ఈశ్వరబాబు, జనార్ధన్, గంగాధరం, చిరంజీవి, బాలు, వంశీ, చక్రధర్, సురేష్, లక్ష్మీప్రసాద్, సుహాసిని, లక్ష్మీదేవి, మునికుమారి, పంచాయతీ కార్యదర్శులు చెంచయ్య, భార్గవ్ సత్యం, మునిరత్నం, సీపీఎస్ నాయకులు సుబ్బారెడ్డి, పెన్షనర్లు ప్రభాకర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ సంఘీభావం

ఉద్యోగుల ధర్నాకు టీడీపీ సంఘీభావం ప్రకటిం చింది. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి హాజరై ధర్నాలో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగా నే ఉద్యోగుల సమ స్యల పరిష్కా రానికి కృషి చేస్తామని చెప్పారు.

25న ప్రొఫెషనల్ కనెక్ట్ విత్ లీడర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 25 తేదీన 'ప్రొఫెషనల్ కనెక్ట విత్ లీడర్' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఊరందూరులోని ఆయన స్వగృహంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముచ్చివోలు రోడ్‌లోని ఎస్‌వీఎస్ కళ్యాణ మండపంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. గ్రాడ్యుయేట్లు, మేధావులు, వైద్యులు, న్యాయ వాదులు తదితరులు తమ విలువైన ఆలోచనలను ఇందులో పంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రొఫెషనల్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు సుమంత్, ప్రధాన కార్యదర్శి చాణుక్య, అసెంబ్లీ అధ్యక్షులు మోహన్ లాల్, ప్రధాన కార్యదర్శి ఉమేంద్ర సభ్యులు తేజ నాయుడు, సేతు, లోకేష్, మౌళి పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తికి చెందిన విశ్రాంత ఉపాధ్యా యురాలు పసుపులేటి ధనలక్ష్మి రూ.30 వేలు విరాళం సమర్పించారు. ఈ మేరకు శనివారం ఆలయంలోని పరిపాలనా భవనంలో పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు నగదు అందజేశారు. దాతను ఆయన ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

సత్యవేడు, ఫిబ్రవరి 17: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 13 సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జనన, మరణాలు, రిజిస్ట్రేషన్ల, ఆదాయ వివరాలు, పంచాయతీ ఖర్చుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలనే అంశాలపై అవ గాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ చిరంజీవి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడాలి



నాటిక వేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

రేణిగుంట, ఫిబ్రవరి17: విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడాలని జన విజ్ఞాన వేదిక నాయకులు వెంకటరమణ కోరారు. శనివారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'సత్యాన్వేషణ' నాటకం వేశారు. ప్రదర్శించారు. ఇటలీలో సత్య స్థాపన కోసం పోరాడిన గియోనార్డో బ్రూనోను ఆదేశ మత పాలకులు 1600 సంవత్సరం ఫిబ్రవరి17న సజీవదహనం చేశారని ఆయన తెలిపారు. భూమి సూర్యుడి చుట్టు తిరుగుతోందని బ్రూనో అప్పట్లో ప్రచారం చేశారని పేర్కొన్నారు. అయితే భూమిచుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని మత పాలకులు ప్రచారం చేసేవారని తెలిపారు. తమప్రచారానికి విరుద్ధంగా ప్రచారం చేస్తావా అని బ్రూనోను సజీవదహనం గుర్తుచేశారు. ఈ సారాంశాన్ని నాటకం రూపంలో ప్రదర్శించి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. మత పాలకుల విధానాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిపారు. జేవీవీ మండల కార్యదర్శి కుప్పస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే హేమలతకు టీడీపీ నాయకుల పరామర్శ



హేమలతను పరామర్శిస్తున్న నాగలాపురం నాయకులు

నాగలాపురం, ఫిబ్రవరి 17: సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలతను టీడీపీ నాయకులు పరామర్శించారు. రెండు రోజులు క్రితం చెన్నైలోని తన నివాస గృహం వద్ద మెట్లు దిగుతుండగా కాలు జారి కిందపడ్డారు. ఆమె చేతికి గాయమైంది. ఆమె అస్వస్థతకు గురికావడంతో సత్యవేడు ఇన్‌చార్జ్ హెలెన్, ఇతర కుటుంబ సభ్యులు అక్కడి అపోలోకు తరలించారు. చేతికి శస్త్రచికిత్స జరిగింది. ఈ నేపథ్యంలో శని వారం టీడీపీ జిల్లా నాయకులు నరసింహయాదవ్ ఆస్పత్రిలో ఆమెను పరామర్శించారు. ఆయనతో పాటు సత్యవేడు నాయకులు, నాగలాపురం మండల నాయకులు పార్థీబన్, సుబ్రహ్మణ్యం రాజు, జాన్సన్, పరశురాం శిల్పి తదితరులు కూడా ఆమెను పరామర్శించారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న బిజు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: మహిళా సాధికారతతోనే దేశ అభివృద్ధి సాధ్యమని కేరళ రోటరీ క్లబ్ ప్రతినిధి బిజు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మహిళా సాధికారతపై అవగాహన తరగతి నిర్వ హించారు. ఈ సందర్భంగా బిజు మాట్లాడుతూ విద్యతోనే మహిళల్లో చైతన్యం సాధ్యమని వివరించారు. సమాజంలో మహిళలు మానసిక దృఢత్వంతో ఎలా ముందుకు సాగాలో తెలిపారు. చట్టాలపై అవగాహన పెంచుకుని అవసరమైన సమయంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షులు జనార్దన్‌రావు, కార్యదర్శి డాక్టర్ వెంకటరామన్, మాజీ అధ్యక్షులు కండ్రిగ ఉమ, ప్రతినిధులుగా చక్రాల ఉష, ప్రమీలమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించకుంటే చర్యలు తప్పవు : పీడీ



నెలటూరులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ

సత్యవేడు, ఫిబ్రవరి 17: ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్యాలను అధిగమించకుంటే చర్యలు తప్పవని పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని నెలటూరు, కడూరు పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ ప్రేమ్ కుమార్‌తో కలసి ఆయన తనిఖీ చేశారు. కమ్యూనిటీ గడవుట్ పాండ్, మినీ అమృత్ సరోవర్ పనులను తనిఖీ చేశారు. ఆయనవెంట ఏపీవో కృష్ణయ్య, జేఈ స్వామి దాసు, టెక్నికల్ అసిస్టెంట్లు శ్యాంప్రసాద్, తిరుపతి ఫీల్డ్ అసిస్టెంట్లు దిలీప్, శంకరయ్య పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 17: మండలంలోని వలం టీర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 192 మంది వలంటీర్లకు సేవామిత్ర, ఐదుగురికి సేవారత్న పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షాలెట్, ఏవో త్రివిక్రమ్, ఈవోపీఆర్డీ రాజశేఖర్, వైసీపీ నాయకులు విద్యానాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో ఒకరికి కూడా సేవా వజ్ర అవార్డు రాకపోవడంపై వలంటీర్లు అసంతృప్తి వ్యక్త చేశారు. సచివాలయ సిబ్బంది చేయాల్సిన విధులను సైతం తమతో చేయించారని అయినా తమలో ఒకరికి కూడా సేవావజ్ర రాకపోవడం ఏమిటని విచారం వ్యక్తం చేశారు.

ఉమ్మడి ప్రభుత్వంతో శాంతి భద్రతల పరిరక్షణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారిస్తామని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత అన్నారు. పట్టణంలోని బహుదూర్‌పేట ప్రాంతంలో శనివారం ఉమ్మడి మ్యానిఫెస్టోపై ఇంటింటి ప్రచారం చేశారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శనిప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.